


# వ్యర్థంలో అర్థం

శ్రీవిరించి

"కోదండరామయ్యగారి యిల్లు యిదేనా ?"అంటూ వచ్చాడు ఒక మధ్యవయసు ఆసామీ.

ఇంటి ముందుకు వచ్చి నిలిచాడు; పిలిచాడు.

ఎవరూ పలకలేదు.

అటుయిటు చూచాడు.

ఎవరూ పలుకలేదు

వరండాలో ఆడుకుంటున్న యిద్దరు పిల్లలు తమ ధ్యాసలోనే ఉన్నారుగానీ అతన్ని పట్టించుకునే పద్ధతిలో లేరు.

"ఇదుగో ....అబ్బాయి...నిన్నే..." అని కాస్త గొంతు పెద్దది చేసి అడిగాడు. ఇద్దరు కుర్రవాళ్లు ఆడుకుంటూనే ఉన్నారు. వాళ్లలో ఒకడు మాత్రం యిటువయిపు తలతిప్పి చూచాడు. మల్లెపువ్వులాంటి తెల్లదుస్తులు ధరించిన ఆ మనిషిని ఎగాదిగా చూచాడు. అతను మళ్లీ అడిగాడు.

"కోదండరామయ్య గారి యిల్లు యిదేగదూ"

ఆ కుర్రాడి ముఖంలో వున్న ప్రశ్న: "కోదండ రామయ్య ఎవరు"

రెండో కుర్రాడి ధ్యాస కూడా యిప్పుడు యిటే మళ్లింది.

"తాతయ్య కోసం రా"అన్నాడు మొదటి కుర్రాడి తో.

తాతయ్య కోసం ఎవరయినా వచ్చి పిలవడం బొత్తుగా ఎరగని సన్నివేశం. అందుకే ఇద్దరు కుర్రవాళ్లూ మళ్లీ ఒకళ్ల ముఖాలు ఒకళ్లు చూచుకున్నారు.

"కోదండరామయ్యగారు ఉన్నారా బాబూ! ఒకసారి పిలవ్వూ" అన్నాడు ఆ మధ్యవయసు ఆసామీ. ఇల్లు ఇదేనని తెలుసు . ఆయన్ను పిలవటానికి ఎందుకు ఈ పిల్లలు తటపటా యిస్తున్నారో తెలియదు.

"మా తాతయ్యా"అని అడిగాడు మొదటి కుర్రాడు.

"అవును బాబూ! తాతయ్యగారిని పిలువు' ' అన్నాడు సాత్వికంగా మళ్లీ అతను.

లోపలనుంచి ఓ ఇరవయియేళ్లఅమ్మాయి పైకి వచ్చింది. "తాతయ్య దొడ్లో చింతచెట్టు కింద కూర్చుని ఉన్నాడు. అక్కడికే వెళ్లండి. ఆయన నడవలేడు" అంది ఆ అమ్మాయి.

ఇంటిపక్క ఆవరణ నుంచి దారి చూపింది ఆ అమ్మాయే!

అతను ఉత్సాహం తెచ్చుకుని దొడ్డి వైపు నడిచాడు. ఇంటిచుట్టూ ఆకులు, అలములు చెల్లాచెదరుగా పడి ఉన్నాయి. ఎన్నాళ్లయిందో ఇదంతా ఎవరయినా శుభ్రం చేసి!

ఆ ముసలాయన దొడ్లో చెట్టుకింద కూర్చుని ఉన్నాడు తపస్సు చేసుకుంటున్న మునిలా.

బాగా ముదిరిన ముఖం . ఖండువా కప్పుకున్నాడు భుజం మీద. మాసిపోయిన పంచె.

అతను ఆయనకు ఎదురుగా వెళ్లి నిలుచున్నాడు. 'నమస్కారం' అన్నాడు చేతులు జోడించి.

ముసలాయన చూస్తున్నాడు. ఎవరు?

తపోభంగం అయినందుకు ఆ ముఖంలో చికాకు లేదు. అసలెలాంటి భావమూ లేదు. చెక్కలా మొద్దు బారిపోయిన ముఖం.

అతను మళ్లీ అన్నాడు. "నమస్కారం. దీనదయాళరావుగారు పంపారు నన్ను"


ముసలాయన ముఖంలో కొద్దిగా కదలిక.

దీనదయాళరావు పేరు వినడంతోటే కొంత చలనం మనస్సుకు వచ్చినట్టయి ముఖంమీద గుర్తులు తేలుతున్నాయి.

"ఈ బ్రీఫ్‌కేస్ మీకు ఇమ్మన్నారు..." అన్నాడు వచ్చిన అతను.

"ఎక్కడ దీనదయాళరావు?" అనడిగాడు నీరసంగా. ఈ మనిషివెనగ్గా ఎవరేనా ఉన్నారా- అని పరీక్షగా చూస్తూ ...

"వారు రాలేదు. అర్జెంటుగా కబురు వచ్చి ఢిల్లీ వెళ్లిపోయారు. మిమ్మల్ని మళ్లీ కలుసుకుందుకు కుదరలేదు, క్షమించమని చెప్పమన్నారు. ఈ బ్రీఫ్‌కేస్ .. "అన్నాడు ఈ మారు బ్రీఫ్ కేస్‌ను ప్రధానంగా ముందుకు చూపుతూ.



ముసలాయన చేతులు ముందుకు చాచాడు ...దానిని అందుకునేందుకు.

ఆ చేతులు వణుకుతున్నాయి.

అతనికి అనుమాన మొచ్చింది. ఆయన దీన్ని మోయలేడు. బరువు.

"ఇంట్లో ఎక్కడ పెట్టమంటారో చెప్పండి. మీరు మొయ్యలేరు....బరువు.... "అన్నాడు.

''అవును. మొయ్యలేను..''అని ముసలాయన కూర్చున్న చోటునుంచి లేచాడు. అడుగు ముందుకు వేసే లోపలే యింట్లోనించి అమ్మాయి కూడా బయటకు వచ్చింది. ముసలాయన్ను చేయి పట్టుకు నడిపించింది.

అందరూ ఇంట్లోకి చేరుకున్నారు. ముసలాయన్ను ఒక కుర్చీలో కూర్చోబెట్టింది ఆ అమ్మాయి.

అతనికో కుర్చీ చూపింది.

గదిలో ఓ మూల చెక్కబల్ల...చిన్నది..ఉంది.

దానివేపు చూపించాడు ముసలాయన.

అమ్మాయి దానిని దగ్గరికి తేవటానికి అటుగా అడుగులు వేసింది.

అని అతను ముందుకు నడిచి బ్రీఫ్‌కేసు దానిమీద భద్రంగా ఉంచాడు.

తిరిగి కుర్చీదగ్గరకు వచ్చాడు.

"నాకు సెలవు యిప్పించండి" అన్నాడు.

"కాస్త టీ తాగి వెళ్లండి" అంది ఆ అమ్మాయి. ముసలాయన అలానే చేయమని తల ఆడించాడు.

"వద్దండీ. ఇంకా చాలాపని ఉంది. సెలవు ఇప్పించండి. తరవాత తీరుబాటుగా వస్తాను. మిమ్మల్ని గురించి దీనదయాళరావుగారు చాల చెప్పారు. తరవాత వివరంగా మీతో మాట్లాడతాను'' అంటూ అతను ముసలాయనకు.... కోదండరామయ్యకు కాళ్లు తాకి నమస్కారం చేశాడు.

తరవాత అమ్మాయికి కూడా చెప్పి వెళ్లిపోయాడు.

అతను వెళ్లిపోయిన తరువాత అమ్మాయి మళ్లీ తాతయ్య దగ్గరకు వచ్చింది. "ఎవరు దీనదయాళరావు?"

''నా పాతస్నేహితుడు'' అన్నాడు కోదండరామయ్య.

తాతయ్యకు స్నేహితులా?

దీనదయాళరావు మళ్లీ వస్తాడని అనుకున్నాడు కోదండరామయ్య. కాని ...రాలేదు... అతనికి ఎప్పుడూ అర్జెంట్ పనులు. బ్రీఫ్‌కేస్ మటుకు పంపించాడు.

"ఏమిటి తాతయ్యా అది! '' అని అడిగింది అమ్మాయి.

'మొన్న సాయంత్రం దీనదయాళరావు వచ్చి వెళ్లిన సంగతి అమ్మాయికి తెలియదు కదూ!' అనుకున్నాడు కోదండరామయ్య.

ఆయన జవాబు చెప్పలేదు. ఆమె వంక ఆశీర్వదిస్తున్నట్లు గా చూచాడు.

❀ ❀ ❀

రెండు రోజుల క్రితం --

మామూలు ప్రకారం చింతచెట్టు కింద కోదండ రామయ్య ఒక్కడే కూర్చునిఉన్నప్పుడు ఎవరో ముందు వరండాలో తిరుగుతున్న అలికిడి అయింది.

ఇంట్లో మరి ఎవరూ లేరు. కొడుకు ఉద్యోగం చోటుకు వెళ్లాడు. ఇంకా అరగంట అయితే గాని ఇల్లు చేరడు. కోడలు పోయి పదేళ్లయింది. మనుమరాలు సాయంత్రం టైపురైటింగ్ క్లాసుకు వెళ్లింది. మనుమళ్లు బడి నుంచి వచ్చి పుస్తకాల సంచులు గిరవాటు వేసి అక్కయ్య చేసివుంచిన ఫలహారం గబగబ తినేసి ఆడుకోవటానికి పరుగెత్తారు.

కోదండరామయ్య నిదానంగా ముందు వరండాలోకి చేరుకున్నాడు. కళ్లు సరిగాఆనడం లేదు. చికిలించి చూచాడు. ఎవరో ముగ్గురు నిలబడి ఉన్నారు. ఆయన్ను చూడగానే వాళ్లలో ఒకాయన గబగబ ముందు కు నడిచి కోదండ రామయ్య చేతులు రెండూ పట్టుకుని తన గుండెలమీద పెట్టుకుని గౌరవపురస్సరంగా తల పంకించాడు.

''అప్పుడే ఇంత ముసలివాడి వయిపోయినావేం, కోదండరామయ్యా ...'' అన్నాడు అతను.

కోదండరామయ్య అతని ముఖం లోనికి గుచ్చి చూచి " ఎవరు....ఎవరు.... దీన దయాళా..అవును కదూ! '' అన్నాడు.

"అవును కోదండరామయ్యా , నేను దీనదయాళు నే.. వీళ్లు ఇద్దరూ తెలుసా నీకు? ఈ ఊళ్లోనే ఉంటారు. శేషశయనం.. దండపాణి...మనవాళ్లే ..." అన్నాడు ఆ కొత్త ఆసామీ.

కోదండరామయ్య వాళ్లను అతి నిదానంగా హాల్లోకి తీసుకువెళ్లాడు. వాళ్లే ఆ మూల ఈ మూలపడివున్న మూడు కుర్చీలు చేర్చుకుని కోదండరామయ్య పడక కుర్చీకి దగ్గరగా వేసుకుకూర్చున్నారు.

" ఎన్నాళ్లయింది, నిన్ను చూచి... అయినా ..ఇంత వృద్ధాప్యం ఎలా వచ్చేసిందయ్యా నీకు అప్పుడే ...అప్పుడు ..ఆరోజు గుర్తు ఉంది నాకు......''అన్నాడు దీనదయాళరావు.

1942లో పోలీసుల్నీ , బ్రిటీషు వాళ్లనూ కన్నుగప్పి కలెక్టర్‌ఆఫీస్ మీద కాంగ్రెస్ జెండా ఎగరవేసిన ఉదంతం గుర్తు చేశాడు దీనదయాళరావు. "పోలీసులు ఆ సాయంత్రం నిన్ను పట్టుకుని.. కొట్టిన దెబ్బలకు నువ్వు దాదాపు చచ్చిపోయావనే అనుకున్నాం గదూ" అన్నాడు.


" అప్పుడు చచ్చిపోయినా బావుండేది.'' అన్నాడు కోదండరామయ్య. అతి నీరసంగా ...గొంతులోనే మాటలు కూరుకుపోతూండగా. ఆ మాటలు దీనదయాళరావు వింటూనే: " శివశివ! అట్లా అనకు కోదండరామయ్యా'' అన్నాడు.

కోదండరామయ్య చేసిన సాహసకార్యాలు తతిమ్మా ఇద్దరికీ చెబుతున్నట్లుగా కొన్ని యేకరువు పెట్టాడు దీనదయాళ రావు.

" నువ్వు ఇక్కడే ఉంటున్నావని వింటూనే ఉన్నాను. కాని ఎప్పుడు వచ్చినా యేదో తలమున్కలయ్యేంత పని! కలుసుకోవడం కుదరనే లేదు. ముప్ఫయియేళ్లయినా అయివుంటుంది కదూ మనం ఒకళ్లనొకళ్లం చూచుకుని?ఎలా ఉన్నావు చెప్పు?...చెప్పు......?' ' అన్నాడు దీనదయాళరావు.

ఇంతలో కోదండరామయ్య కొడుకు వచ్చాడు. దీనదయాళరావుకు నమస్కారం చేశాడు. శేషశయనానికి నమస్కారం చేశాడు. దండపాణి వేపు చూచి పరిచయంగా నవ్వాడు. శేషశయనం అతన్ని దీనదయాళరావుకు పరిచయం చేశాడు-" ఇక్కడే మన ఫాక్టరీ లోనే పనిచేస్తున్నాడు. మంచివాడు''

కోదండరామయ్య కొడుక్కు గుర్తు వచ్చింది. ఒకటి రెండు మార్లు తాను శేషశయనం దగ్గరకు వెళ్లడం ... యేదో ఉపకారం చేయమని అడగడమూనా. శేష



శయనం చేస్తాననీ చెప్పలేదు, చెయ్యననీ నిరాకరించలేదు. మౌనంగా ఉండిపోయాడు. తాను మంచివాడని ఇతనికి ఎలా తెలిసిపోయిందో! అయినా నాయకులు అన్న తరువాత ఊళ్లలో వ్యవహారాలు ఒక కంటకని పెడుతూనే ఉంటారు కదా! శేషశయనం , దండపాణి ఎరగని సమాచారం యేం ఉంటుంది ఈ జిల్లాలో.

కోదండరామయ్య మనసులో గుణించు కుంటున్నాడు; పైకి యేమీ మాట్లాడకపోయినా. దీనదయాళు తనతో పాటు అప్పుడు సహాయనిరాకరణం... స్వాతంత్ర్యోద్యమంలో ఉండేవాడు. తరువాత కాలేజీకి వెళ్లి చదువుకున్నాడు. విదేశాలకూ వెళ్లాడు.

తనకే యేమీ చాతకాలేదు. గ్రామంలోనే ఉండిపోయాడు. పెళ్లి...సంసారం... చిన్న ఉద్యోగం...పిల్లలు...పెళ్లిళ్లు ...బరువులు ...బాధ్యతలు. పెద్దవాడు తనని కనిపెట్టుకుని ఇక్కడే ఉన్నాడు. వాడిదీ తనలాగే అయి పోయింది జీవితం . రెంటికీ చెడ్డ రేవడి. అమ్మాయికి పెళ్లి చేయాలి. తతిమ్మా పిల్లల్ని చదివించాలిబాగా.....అమ్మాయికీ చదువు కోవాలనే ఉంది..కానీ చెప్పించే నాథుడేడీ!

కొడుకు లోపలకు వెళ్లి టీ తయారు చేసి తీసుకు వచ్చాడు. నలుగురికీ ఇచ్చాడు.

కోదండరామయ్య టీ చప్పరిస్తూనే దీనదయాళరావు చెబుతున్న సంగతులు వింటున్నాడు. ఇప్పుడు ఢిల్లీలోనే ఉంటున్నాట్ట. జీవితం బాగానే ఉంది. అంతా హడావుడి. వేగం. ఏదీ తీరుబాటుగా ఆలోచించే సమ యం ఉండదు. దేశంలో ... రాష్ట్రాలలో ఉన్న నాయకులే తనను కనిపెట్టి ఉండి తన చేత పనులు చేయించు కుంటూ ఉంటార్ట! ..."ఎప్పుడూ ఢిల్లీ రావేల?" అన్నాడు కోదండరామయ్యతో .

"నాకు ఇక్కడే యేమీ పనిలేదు. ఇంక ఢిల్లీ రావడం కూడా ఎందుకు?"అన్నాడు కోదండరామయ్య.

"ఎర్రకోట మీద జండా ఎగరవేయడం చూడటాని కయినా ఒకమారు రావలసింది. ..." అన్నాడు. "వచ్చే సంవత్సరం నేనే వచ్చి తీసుకువెడతాన్లే !"

"అప్పటిదాకా బతికివుంటే చూద్దాంలే" అన్నాడు బాధగా కోదండరామయ్య.

"అదేమిటి, కోదండరామయ్యా! అంత నిరాశ, నిస్పృహ గూడుకట్టుకు పోయాయేం? నీలో! నాకంటే నాలుగయిదు నెలలు చిన్నవాడివే గదా!" అని దీన దయాళరావు- "అయితే మీరెవ్వరూ కోదండరామయ్యను కనిపెట్టి చూచుకోవడమేలేదన్నమాట!" అన్నాడు శేషశయనం, దండపాణిల వయిపు తిరిగి.

శేషశయనం ఏదో చెప్పబోయాడు. అతని మాటలు గొంతుదాటి బయటకు రాలేదు.

"సరే, నీకు ఎంతమంది కొడుకులు, కూతుళ్లు..." కోదండరామయ్య చెప్పాడు.

సంసారతాపత్రయాలు చెప్పించుకు విన్నాడు -దీనదయాళు. కొడుకులూ, కూతుళ్లు , అల్లుళ్లు.. రాష్ట్రం నలుమూలల చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ కాలం ఈడుస్తు న్నారు. చదువులు, పెళ్లిళ్ల చేయవలసిన మనుమలు, మనుమరాళ్లు , వాళ్ల కడు పులు నింపడం కోసరమే యాతనలుపడి శరీరం డీలా అయిపోతున్న తల్లిదండ్రులు..

జీవితాన్ని గురించి, పెరుగుదల గురించి ఆలోచించేందుకే భయం వేసే పరిస్థితులు ...

"కోదండరామయ్యకు వృద్ధాప్యంలో భార్య అండదండలు లేకపోవడం దురదృష్టం. " అన్నాడు దీనదయాళరావు.

"నేనట్లా అనుకోవడంలేదు. పోయిందో ...అదృష్టవంతురాలు. సుఖపడిపోయింది. బతికినన్నాళ్లూ యేం బావుకుంది గనుక...ఇక నా సంగతంటావా? నాకేం విచారం లేదు. డెబ్బయియేళ్లు గడిచిపోయాయి కదా! ఇంకా మహా అయితే రెండు మూడేళ్లు చాలదూ? వ్యర్థంగా జీవితం గడిచిపోయిందన్న దిగులు తప్ప నాకు ఇంకే దిగులూ లేదు" అన్నాడు కోదండరామయ్య.

"నీ జీవితం వ్యర్థం కాదు, కోదండరామయ్యా! పోనీలే, ఇప్పుడు నేను యేం చెప్పినా ముఖప్రీతి మాటలు అయిపోతాయి. ఇన్నాళ్లూ నిన్ను గురించి తలుచు కోనందుకు నాకు సిగ్గుగా ఉంది" అన్నాడు దీనదయాళరావు.

"నాలాంటి వాళ్లు యెందరో.... యీ దేశంలో ...అజ్ఞాతంగా .... ఎవరూ ఆదుకోకుండా ...వాళ్లపాటికి వాళ్లు సుఖంగా ఉండలేకుండా ..." కోదండరామయ్య మనసులోనే అణిచేసుకున్నాడు మాటలు.

వాళ్లు వెడతామని లేచారు. శేషశయనం, దండపాణి బయటకు వెళ్లాక మళ్లీ కోదండ రామయ్యను కౌగలించుకుంటూ అన్నాడు దీనదయాళరావు.

"రేపు సాయంత్రం వస్తాను. కొద్దిగా డబ్బు యిస్తాను నీకు. మరేం బిడియపడకు. నీ కొడుకులకు ఇవ్వు. పిల్లల చదువులకు, పెళ్లి పేరంటాలకు ఉపయోగించమను. వద్దని నువ్వు మళ్లీ సీన్ క్రియేట్ చేయకుండా యిప్పుడే చెబుతున్నాను. " అన్నాడు రహస్యంగా .

"డబ్బా! వొద్దు.." అన్నాడు కోదండరామయ్య.

" ఒద్దనడం తేలికే! మరేం మాట్లాడకు కోదండం! ఏదో నా స్నేహధర్మం నేను చేయనీ . ఎట్లాంటి వాడివి ఎట్లా అయిపోయినావు....రేపు వస్తాన్లే " అని వెళ్లి పోయాడు.

వాళ్లు వెళ్లిపోయింతర్వాత - కొడుకు కోదండరామయ్యను దొడ్లో చింతచెట్టుకిందకు తీసుకువెళ్లి కూర్చోబెట్టాడు.

